## కమలానికి కొమ్ము కాసిన సౌత్

**ఎడిటోరియల్**



దేశమంతా ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసిన 18వ లోక్‌సభ ఫలితాలు రానే వచ్చాయి. ఈ ఎన్నికల్లో సుమారు 64 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవటం ద్వారా మనది ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యం అనే మాటకు మరింత బలం చేకూరింది. ఎన్నికల నోటిఫికేషన్ మొదలు ఓట్ల లెక్కింపు వరకు 81 రోజుల పాటు ఈ ఎన్నికల ప్రక్రియ సాగింది. ఈ ఎన్నికల్లో 400 సీట్లే తమ లక్ష్యమని ప్రకటించుకుని బరిలో దిగిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 293 స్థానాలు సాధించగా, ఇందులో ప్రధాన పార్టీగా బీజేపీకి దక్కింది కేవలం 240 సీట్లే. ఎన్డీయేకు ప్రత్యర్థిగా దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లోని పార్టీలతో కలిసి నడిచిన ఇండియా కూటమి అంచనాలకు అందని రీతిలో 234 స్థానాలను చేజిక్కించుకుంది. గత ఎన్నికలతో పోల్చితే ఎన్డీయే కూటమి 58 స్థానాలను కోల్పోగా, ఇండియా కూటమి 149 స్థానాలను అదనంగా పొందగలిగింది. ఈ రెండు కూటముల్లో భాగస్వామ్యం లేని పార్టీలు ఈ ఎన్నికల్లో 17 స్థానాలు పొందాయి. ఫలితాలు ఎవరికి అనుకూలంగా వచ్చాయనేది పక్కనపెడితే, ఈసారి గతంలో కంటే తెలివిగా, చైతన్యవంతంగా ఎన్నికల్లో ఓటు వేశారని అనిపించింది. ఈ ఎన్నికలకు సంబంధించి జూన్ 1వ తేదీన వచ్చిన ఎగ్జిట్ ఫలితాలేవీ వాస్తవ ఫలితాలను ప్రతిబింబించలేకపోయాయి.పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరగటానికి ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రభుత్వపు ఏకపక్ష విధానాలు, బలమైన ప్రాంతీయ ఆకాంక్షలతో బాటు సోషల్ మీడియా యూజర్లలో వచ్చిన పరిణతి కూడా కారణంగా కనిపించింది. అయోధ్య, ఆర్టికల్ 370 అంశాలను ప్రజలు తిరస్కరించినట్లు ఎన్నికల గణాంకాలను బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. రోజు వెళ్లదీసేందుకు పోరాటం చేసే బడుగు జీవులెవరికీ ఈ భావోద్వేగ అంశాలేవీ తమ బతుకును బాగుచేస్తాయనే నమ్మకాన్ని కలిగించలేకపోయాయి. మరోవైపు.. విపక్ష 'ఇండియా' కూటమి మోదీ ప్రభుత్వపు ప్రభను తగ్గించటం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అయితే, ఈ ప్రయత్నాల్లో కొంత అపరిపక్వత, గందరగోళం, దేశంలో ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని హరించే ప్రయత్నాలు జరగుతున్నా.. ఆ వాస్తవాన్ని గ్రహించి, అంగీకరించటానికి ఇండియా కూటమిలోని అనేక పార్టీలు పూర్తి స్థాయిలో సిద్ధం కాకపోవటంతో ఈ కూటమి అధికారానికి అడుగు దూరంలో నిలిచిపోయింది. రాజ్యాంగానికి ప్రమాదముందనే ప్రచారం, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళల సమస్యలను ప్రధాన అంశాలుగా ప్రస్తావించటం, గతంలో రాహుల్ చేసిన పాదయాత్ర వంటి అంశాలు మంచి ఫలితాలను ఇచ్చాయి. అయితే, ఇండియా కూటమిలో చేరిన పార్టీలు తమ తమ రాష్ట్రాల్లో ఎన్నికల వ్యూహ చతురత చూపలేకపోవటం, ఆ పార్టీలు తమ బలహీనతలను అధిగమించలేకపోవటం ఒక లోటుగా కనిపించింది.ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి పగ్గాలు వేయటంలో సోషల్ మీడియా కూడా తనవంతు పాత్రను పోషించింది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో సోషల్ మీడియాను బాగా వినియోగించుకున్న బీజేపీ ఈసారి ఈ విషయంలో బోర్లాపడింది. గత రెండు ఎన్నికల్లో అసత్యాలను, అర్ధసత్యాలను, అపోహలను, భయాలను జనంలోకి తీసుకుపోవటంలో ఆ పార్టీ పైచేయి సాధించింది. ఈసారీ ఈ బాణం పారుతుందని ఆశించింది గానీ ఈ వ్యూహాన్ని కొందరు ఔత్సాహిత సోషల్ మీడియా కార్యకర్తలు దీనిని తమదైన శైలిలో కట్టడి చేయగలిగారు. భారత ఆర్థిక వ్యవస్థ, సామాజిక పరిస్థితులు, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు, రైతుల సమస్యలు, మోదీ పాలనలో కార్పొరేట్లకు చేరుతున్న దేశసంపద, విపక్షాల నేతలను ఈడీ, సీబీఐ వంటి ఏజెన్సీలు బెదిరించి తమవైపు లాక్కుంటున్న తీరు, అనైతిక మార్గాల్లో బీజేపీ సంపాదించుకున్న ఎన్నికల బాండ్లు వంటి అనేక అంశాలపై ధ్రువ్ రాఠీ, సీనియర్ పాత్రికేయుడు రవీష్ కుమార్ వంటి వందల మంది తమ వీడియోలతో ప్రజలకు నిజాలేమిటో చెప్పటంలో విజయవంతమయ్యారు. తద్వారా వాస్తవాలు, అసత్యాల మధ్య ఉన్న అంతరాన్ని పసిగట్టగల చైతన్యం ఓటర్లలో పెరిగేలా చేశారు. దీంతో ఎప్పటిలాగే భావోద్వేగ అంశాలతో గట్టెక్కగలమన్న పాలక పక్షం ఆశలపై వీరు నీళ్లు చల్లారు.ఈ ఎన్నికల్లో మరో ఆసక్తికరమైన మరో పరిణామం కూడా చోటు చేసుకుంది. ఉత్తర, తూర్పు, పశ్చిమ భారత దేశంలోని ఓటర్లు బీజేపి పట్ల అనాసక్తిని, విముఖతను ప్రదర్శించగా, దక్షిణాది ఓటర్లు మాత్రం కమలాన్ని ఆదరించారు. బీజేపీ ఆవిర్భావం తర్వాత బీజేపీ కేరళలో తొలిసారి ఖాతా తెరవటమే గాక 17 శాతం ఓటు బ్యాంకును ఆ పార్టీ పొందగలిగింది. తమిళనాడు గతంలో బీజేపీకి ఉన్న 3.2 శాతం ఓటుబ్యాంకు ఈసారి 11.2 శాతానికి పెరిగింది. తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల వేళ 14 శాతంగా ఉన్న బీజేపీ ఓటు బ్యాంకు ఏకంగా 35.08 శాతానికి పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటూ సాధించలేక బోల్తా పడిన బీజేపీ, ఈసారి అక్కడ ఎనిమిది మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను గెలిపించుకోగలిగింది. తమిళనాడు, కేరళను మినహాయిస్తే, ఏపీలో పొత్తు పార్టీలైన జనసేన, టీడీపీ బలమే బీజేపీ బలం కాగా, తెలంగాణలో బీఆర్ఎస్ పరోక్ష మద్దతే బీజేపీ బలం అయింది. 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల వేళ కనిపించిన మరో అరుదైన దృశ్యాన్ని కూడా మనం చెప్పుకుని తీరాలి. సహజంగా ఏ ఎన్నికల్లోనైనా విజేతలు సంతోషాల్లో మునిగిపోవటం, అధికారం దూరమైన వారు నిరాశకు లోనుకావటం జరుగుతుంది. కానీ, మంగళవారం నాటి లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తిరిగి అధికారంలోకి రానున్న కారణంగా బీజేపీ, వందసీట్లు దాటి ఇండియా కూటమిని బలోపేతం చేసినందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషాల్లో మునిగిపోయారు. అటు యూపీలోని సమాజ్ వాదీ పార్టీ, బీహార్‌లోని ఆర్జేడీలు తమ సొంతబలాన్ని తిరిగి పొందినందుకు సంతోష పడ్డాయి. మహారాష్ట్రలోని శరద్ పవార్, ఉద్ధవ్ వర్గాలు తాము పైచేయి సాధించామని సంతోషపడ్డాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తన గెలుపు కంటే కమలాన్ని కట్టడిచేయగలిగినందుకే వేడుకల్లో మునిగిపోయింది. ఏదో ఒక స్థాయిలో తాము ఆశించిన ఫలితాలు సాధించటం లేదా ప్రత్యర్థి విఫలం కావటం వల్లనేమో.. విచిత్రంగా ఈసారి ఏ పార్టీ కూడా ఈవీఎం యంత్రాల మీద అనుమానాలు వ్యక్తం చేయలేదు.రెండు పార్లమెంటు ఎన్నికల్లో మంచి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈసారి మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి సిద్ధం అవుతోంది. గత పదేళ్ల కాలంలో ఏకపక్ష నిర్ణయాలు, ప్రజాస్వామ్య విలువల పట్ల చిన్నచూపుతో వ్యవహరించిన మోదీ అండ్ కో.. ఈసారి చాలా పరిమితులకు లోబడి పాలన చేయబోతున్నారు. జాతీయవాదమే సర్వోన్నతం, సర్వోత్తమం అంటూ దశాబ్దకాలంగా వీరంగాలు వేసిన కమలం పార్టీ.. ఇప్పుడు అనివార్యంగా దేశపు వైవిధ్యాన్ని, బహుళత్వ విలువలను, బలమైన ప్రాంతీయ ఆకాంక్షలను గౌరవించి తీరాల్సిన అనివార్యత ఏర్పడింది. అదే సమయంలో లోక్‌సభలో కాంగ్రెస్ నాయకత్వంలోని బలమైన ఇండియా కూటమిని కూడా బీజేపీ ఎదుర్కోవాల్సి ఉంది. ఏదిఏమైనా.. కీలక ప్రభుత్వ నిర్ణయాల విషయంలో పార్టీల ఏకాభిప్రాయ సాధన, విపక్షపు మాటకు మన్నన, భిన్నమైన ఆలోచనలకు గౌరవం వంటి కనుమరుగైన అరుదైన పార్లమెంటరీ సంప్రదాయాలకు ఈ 18వ లోక్‌సభ ప్రాణ ప్రతిష్ఠ చేయగలిగితే.. ఈ 18వ లోక్‌సభ సాధించే అతిపెద్ద విజయం ఇదే అవుతుంది. అది ఆచరణలోకి రావాలని, వస్తుందని ఆశిద్దాం.

## 85లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ.. సీడబ్ల్యూసీ తీర్మానం

**న్యూఢిల్లీ జూన్ 8**

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని ఎన్నుకునేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి రాహుల్ గాంధీ అంగీకరించవచ్చని కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానని ఆయన చెప్పారన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మనీష్ తివారీ, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నియమించాలని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది.కాగా, సీడబ్ల్యూసీ సమావేశం తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత కావాలని కాంగ్రెస్ నేతలంతా గట్టిగా కోరుతున్నారని ఆ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఇది వర్కింగ్ కమిటీ అభ్యర్థన అని చెప్పారు.

# 49ఎల్ ఆర్ఎస్ పై భట్టి విక్రమార్క కీలక నిర్ణయాలు..!

**హైదరాబాద్: ప్రభాత సూర్యుడు**

ఎల్ ఆర్ ఎస్ పై, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ ప్రక్రియ ప్రారంభమైన సంబంధిత దరఖాస్తులను పూర్తి చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ముందే ఎల్‌ఆర్ఎస్, దరఖాస్తులు పూర్తిచేయకపోవడానికి గల కారణాలపై సమీక్షించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

**ఆదాయం పెంచే మార్గాలపై అన్వేషించాలి..**

ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చాలని కోరారు. పూర్తిగా అర్హత ఉన్న స్థలాలకే ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్ఎస్) అమలు చేయాలని, ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఈ పథకం కింద ప్రయోజనం పొందే ప్రమాదం పొంచి ఉందని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, ఆరోగ్యశ్రీ విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



**బడ్జెట్ అంచనాలకు..!**

సమీక్షలో భాగంగా గత రెండు నెలల ఆర్థిక ప్రగతిని సమీక్షించారు. ఆ తర్వాత బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు నెలలు కనబరిచిన పనితీరును సమీక్షించి ఆయా శాఖల్లో పనితీరు మెరుగుపరచుకోవడానికి యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుని ఎలాంటి లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్ట పరిచి బడ్జెట్ అంచనాలను అందుకోవాలని వివరించారు. ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును డిప్యూటీ సీఎం భట్టి అడిగి తెలుసుకున్నారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ టాక్స్ విభాగాల్లో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

**రుణాల వడ్డీ రేటుపై..**

ఆర్టీసీ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేటును సమీక్ష చేసుకొని, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలు బదలాయింపు చేసుకుని ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇటీవల సింగరేణిలో చేసిన ఈ ప్రయోగం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిన విషయాన్ని ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులకు వివరించారు. హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇల్లు, వచ్చిన ఆదాయం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ విక్రయించని ఇల్లు, ఇళ్ల స్థలాలు వాటి పరిస్థితిని సమీక్షించారు.

**ఆరోగ్యశ్రీ బకాయిలపై సమీక్ష..!**

రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యుడు సంతృప్తి చెందడమే ప్రధాన లక్ష్యమని అధికారులకు సూచించారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారి చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అమలు చేస్తున్న ప్యాకేజీల ధరలకే ప్రైవేటు ఆస్పత్రిలో ఆయా చికిత్సలు అందించేందుకు వారిని ఒప్పించాలని, ఈ పథకం సామాజిక బాధ్యతలో భాగమని వారికి వివరించాలని, వారితో చర్చలు జరపాలని డిప్యూటీ సీఎం అధికారులను కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమర్షియల్ టాక్స్ కమిషనర్ శ్రీదేవి, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్‌కి బార్ కొంప ముంచింది

**న్యూఢిల్లీ, జూన్ 8ప్రభాత సూర్యుడు**

ఎన్నికల ప్రచారంలో నినాదాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. అవి పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ప్రచారంలో పాల్గొనేలా చేయడమే కాదు, జనబాహుళ్యంలోనూ ప్రభావం చూపుతుంటాయి. ఐదేళ్ల పాలన అనంతరం 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయాలంటూ భారతీయ జనతా పార్టీ ప్రచారం చేసింది. ఈ క్రమంలో "ఫిర్ ఏక్ బార్.. మోదీ సర్కార్ (మరోసారి మోదీ ప్రభుత్వం)" అన్న నినాదాన్ని ఇచ్చింది. ఇది జనంలో విస్తృతంగా వెళ్లింది. మొత్తంగా 2014తో పోల్చితే 2019లో బీజేపీకి సొంతంగానే మరిన్ని ఎక్కువ సీట్లు వచ్చాయి. బీజేపీ చరిత్రలోనే తొలిసారిగా 300 మార్కు దాటి, 303కు చేరుకుంది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ మరో ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న మోదీ సర్కారు 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన నినాదం ఏమాత్రం ప్రభావం చూపలేదు. గతం కంటే సంఖ్య పెరగడం మాట దేవుడెరుగు.. కనీసం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యాబలాన్ని కూడా సొంతంగా సాధించలేక చతికిలపడింది. ఇంకా చెప్పాలంటే ఆ నినాదమే బెడిసికొట్టిందని కొందరు విశ్లేషిస్తున్నారు. "అబ్ కీ బార్.. చార్ సౌ పార్ (ఈసారి 400 దాటాలి)" అన్న నినాదం నిజానికి కొన్ని రాష్ట్రాల్లో మంచి ఫలితాలను ఇచ్చినప్పటికీ.. గత ఎన్నికల్లో భారీ సంఖ్యలో సీట్లను కట్టబెట్టిన పెద్ద రాష్ట్రాల్లో మాత్రం చేదు అనుభవాన్ని మిగిల్చింది. మొత్తమ్మీద 400 సీట్లు దాటి గెలవాలని ప్రయత్నిస్తే.. సొంతంగా కాదు కదా.. కూటమిగా కూడా సాధించలేక.. సొంతంగా 240, కూటమిగా 293 సీట్లతో సరిపెట్టుకోవాల్సిన ఫలితం ఎదురైంది.దేశంలో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజానాడి గురించి ఎప్పటికప్పుడు విశ్లేషణలు అందజేసే ప్రముఖ సెఫాలజిస్టు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వైఫల్యం గురించి కూడా విశ్లేషించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విషయంలో ఆయన విశ్లేషణ నూటికి నూరుపాళ్లు నిజమైనప్పటికీ.. కేంద్రంలో బీజేపీ సాధించిన విషయంలో ఆయన అంచనాలు కొంతమేర తప్పాయి. అందుకు కారణాలను విశ్లేషిస్తూ.. ఆయన మీడియా ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్న 400 సీట్లు రాకపోయినా.. సొంతంగా 300 సీట్లు సాధిస్తుందని ప్రశాంత్ కిశోర్ ఎన్నికలకు ముందు అంచనాలు వెల్లడించారు. కానీ ఇంత పేలవమైన ప్రదర్శన తర్వాత ఫలితాల సరళిని విశ్లేషించుకుని.. అందుకు దారితీసిన కారణాలను వెల్లడించారు. "అబ్ కీ బార్.. చార్ సౌ పార్" అన్న నినాదాన్ని ప్రజలు మోదీ సర్కారు అహంకారానికి నిదర్శనంగా భావించారని పీకే చెబుతున్నారు. ఎవరైనా గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకుంటారు.. కానీ సీట్ల సంఖ్యను కూడా లక్ష్యంగా పెట్టుకోవడం.. ప్రధాని మోదీ సైతం మూడోసారి అధికారంలోకి వస్తే మరిన్ని సంచలన, కఠిన నిర్ణయాలు ఉంటాయని ప్రచారంలో చెప్పడం కూడా జనంలో సరికొత్త సందేహాలకు తావిచ్చింది. గతంలో కొందరు బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యల్లో రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తామని చెప్పినవి ఈ సందర్భంగా తెరపైకి వచ్చాయి. ఈసారి 400 సీట్లు మించి గెలవాలని కోరుకుంటున్నారంటే.. రాజ్యాంగాన్ని మార్చేయడం కోసమే అన్న అనుమానాలు తలెత్తాయి. ప్రతిపక్షాలు సైతం ఇదే విషయాన్ని ప్రధాన ప్రచారాస్త్రంగా మలచుకున్నారు. బీజేపీ ఈసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటోందని, అందుకే 400కు పైగా సీట్లు కోరుకుంటోందని విమర్శించాయి. ఇంకో అడుగు ముందుకేసి, ఎక్కడో ఎవరో అనామక బీజేపీ అనుబంధ సంఘాల నేత రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలకు ప్రాచుర్యం కల్పించాయి. మూడోసారి అధికారంలోకి వస్తే బీజేపీ రిజర్వేషన్లను తొలగిస్తుంది అంటూ విస్తృత దుష్ప్రచారానికి పాల్పడ్డాయి.పార్టీలో, ప్రభుత్వంలో నెంబర్-2 స్థానంలో ఉన్న అమిత్ షా.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఓ సభలో "తాము అధికారంలోకి వస్తే మతం ఆధారంగా ఇస్తున్న ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తాం" అంటూ చేసిన ప్రసంగాన్ని ఎడిట్ చేసి.. "తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు తొలగిస్తాం" అన్నట్టుగా మార్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా ఖాతాల నుంచే ఈ వీడియోలను పోస్ట్ చేశారు. నిజానికి ఆయన చేసిన ప్రసంగంలో తొలగిస్తామన్నది మతం ఆధారంగా ఇస్తున్న ముస్లిం రిజర్వేషన్లను మాత్రమే. ఆ తర్వాతి వాక్యంలో నిజానికి ఈ రిజర్వేషన్ ఫలాలు దక్కాల్సింది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అని చెప్పారు. అంటే ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ఈ మూడు వర్గాలకు నష్టం కలుగుతుందని చెప్పడమే ఆయన ఉద్దేశం. కానీ దాని అర్థమే మార్చేలా వీడియోను ఎడిట్ చేసేసరికి.. ఏ వర్గాలను ఆకట్టుకోవాలని అనుకున్నారో.. ఆ వర్గాలే బీజేపీని అనుమానించాయి. ఇదిలా ఉంటే.. తమ పదేళ్ల పరిపాలన కేవలం ట్రైలర్ మాత్రమే, అసలు సినిమా ముందుంది అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాలు సైతం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చాయి.

# షర్మిళపై కాంగ్రెస్‌లో తిరుగుబాటు

**కడప, జూన్ 8 ప్రభాత సూర్యుడు**

ఏపీలో షర్మిల అనుకున్నది సాధించగలిగారా? కాంగ్రెస్ పార్టీని మెరుగైన స్థితికి తీసుకెళ్లగలిగారా? అంటే మొదటి దానికి సంతృప్తికరమైన సమాధానం వస్తోంది.రెండో దాని విషయంలో మాత్రం లేదనే జవాబు వస్తోంది. అన్నతో విభేదించి తెలంగాణలో పార్టీ పెట్టారు షర్మిల. అక్కడ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణలోని రాజకీయం చేయాలని భావించారు. కానీ కాంగ్రెస్ హై కమాండ్ అందుకు అనుమతించలేదు. ఏపీ పగ్గాలు అప్పగించింది. అయితే అక్కడ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం దక్కించుకున్న షర్మిల.. పార్టీ బలోపేతం కంటే అన్న జగన్ పతనాన్ని ఎక్కువగా కోరుకున్నారు. అందులో మాత్రం సక్సెస్ అయ్యారు. ఆమె పోరాట ఫలితమే కడప జిల్లాలోవైసిపి పతనం.కానీ ఆమె పోరాటం కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూర్చలేదు.కడప జిల్లా ప్రజలు మనసు మార్చేందుకు షర్మిల చేయని ప్రయత్నం అంటూ లేదు.కడప ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆమె జిల్లా ప్రజలకు ఎన్నో రకాలుగా వినతులు ఇచ్చారు.ఆ మహానేత బిడ్డగా కొంగుచాచి అడుగుతున్నాను ఓటు వేయండి అని కోరారు.ఆమె తరుపున వివేక భార్య, కుమార్తె సైతం ప్రచారం చేశారు. వివేకానంద రెడ్డి ని హత్య చేసిన వారికి అండగా నిలబడతారో? బాధితులకు అండగా నిలబడతారో? తేల్చుకోవాలని జిల్లా ప్రజలను కోరారు.అయితే ప్రజలు మాత్రంఆమె మాటను విశ్వసించారు కానీ.ఆమెను ఆదరించలేదు. కూటమి వైపు మొగ్గు చూపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభావాన్ని చూపారు. 10 సీట్లకు గాను ఏడు చోట్ల కూటమి అభ్యర్థులను గెలిపించారు. కానీ పార్లమెంట్ స్థానానికి వచ్చేసరికి త్రిముఖ పోటీలో అవినాష్ రెడ్డి ని గెలిపించారు. వైసిపి అసెంబ్లీ అభ్యర్థులు గెలవడం ద్వారా షర్మిల లక్ష్యం నెరవేరినా.. ఎంపీగా అవినాష్ రెడ్డి గెలుపు మాత్రం షర్మిలకు రుచించని విషయం.అయితే ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. కేవలం జగన్ ను దెబ్బతీయాలని షర్మిల చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆ విషయంలో మాత్రం ఆమె సక్సెస్ అయ్యారు. కానీ కాంగ్రెస్ పార్టీని లైమ్ లైట్లో తీసుకురావడంలో మాత్రం ఫైలయ్యారు. నిన్నటి వరకు ఆమె కాంగ్రెస్ పార్టీకి ఆశాదీపం అవుతారని భావించిన వారు నీరుగారిపోయారు. పార్టీలో సైతం ఒక రకమైన అసంతృప్తి కనిపిస్తోంది. ఎన్నికల్లో టికెట్లు అమ్ముకున్నారన్న ఆరోపణ ఇప్పుడు బయటకు వచ్చింది. విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలనుకున్న సుంకర పద్మశ్రీ తాజాగా మీడియా ముందుకు వచ్చారు. షర్మిలపై ఆరోపణలు చేశారు. ఆమెతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి లాభం లేదని.. టిక్కెట్లు సైతం అమ్ముకున్నారని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో సైతం షర్మిలపై తిరుగుబాటు ప్రారంభం అయినట్టు కనిపిస్తోంది.



## 95అమెరికా పర్యటన లో తెలంగాణ మంత్రులు..!

**కోకాకోలా గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్ తో భేటీ**

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**

అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ పరిశ్రమల శాఖామాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అట్లాంటాలోని కోకా-కోలా హెడ్ క్వార్టర్స్ లో కంపెనీ అంతర్జాతీయ ప్రభుత్వ సంబంధాల విభాగ గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్ సమావేశమయ్యారు.ఇరువురు నేతలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోకా-కోలా మేనేజ్ మెంట్ ను ఆహ్వానించారు. దాదాపు గంటన్నర సేపు జరిగిన సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులను విజువల్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఎక్కడ ప్లాంట్ స్థాపించినా అందుకు ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని కోకా-కోలా ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు.భారత దేశంలో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని,గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ లో అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని మంత్రుల బృందం జోనథన్ కు వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పట్ల సానుకూలంగా స్పందించిన జోనథన్ హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు.మంత్రులతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ,జయేష్ రంజన్ పెట్టుబడుల శాఖ స్పెషల్ సెక్రెటరీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు ఇతర బృందం పాల్గొన్నారు.

## 19 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఓఒఅ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. 3 రోజులపాటు ఉత్కంఠంగా సాగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ గెలుపొందారు. హోరాహోరీగా సాగిన పోరులో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో మేజిక్ ఫిగర్ చేరుకోకపోయినా.. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఎలిమినేట్ కావడంతో మల్లన్నను విజయం వరించింది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల పోరు ఆసక్తికరంగా సాగింది. మూడు రోజులపాటు కౌంటింగ్ ఉత్కంఠంగా కొనసాగింది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లన్న అలియాస్ చింతపండు నవీన్, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 52 మంది ఉపఎన్నిక బరిలో నిలిచారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో మొత్తం 4.63 లక్షల ఓట్లు ఉండగా, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 1,22,813 ఓట్లు, బీఆర్ఎస్ రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు వచ్చాయి.మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న18 వేల ఓట్ల ఆధిక్యంలో కొనసాగారు. అయితే ఇందులో అభ్యర్థులు ఎవరూ గెలుపు కోటాను చేరుకోలేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. అందులో మల్లన్న, రాకేష్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి మధ్య టైట్ ఫైట్ నడిచింది. రెండో ప్రాధాన్యత ఓట్లలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తర్వాత మల్లన్నకు లక్షా 46వేల 366 ఓట్లు రాగా, రాకేష్‌రెడ్డికి లక్షా 31వేల 674 ఓట్లు వచ్చాయి. దాంతో మేజిక్ ఫిగర్‌కు కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న చేరువయ్యాడు. రెండో ప్రాధాన్యత ఎలిమినేషన్ ప్రక్రియలో భాగంగా రాకేష్‌రెడ్డిని కూడా ఎలిమినేట్ చేయడంతో మల్లన్న విజయం ఖరారైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా మల్లన్న విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. తన విజయానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులకు మల్లన్న కృతజ్ఞతలు తెలిపారు.

# గొర్రెల పంపిణీ లేనట్లేనా!



కరీంనగర్ : కొత్త రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం నిలిపివేయనున్నట్లు తాజాగా తీసుకున్న నిర్ణయాల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి ఇప్పటికే డీడీలు చెల్లించిన వారందరికీ తిరిగి డబ్బులు వాపసు ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గత సంవత్సరం జూన్‌లో రెండో విడత కింద 3,404 యూనిట్ల కోసం లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి 718 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారు. పథకం మంజూరులో అనేక అవకతవకలు జరిగాయని భావించిన కొత్త ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలని నిర్ణయించింది. ఈక్రమంలో లబ్ధిదారులు గొర్రెలు పంపిణీ చేయని పక్షంలో డీడీల డబ్బులు తిరిగి చెల్లించాలని ప్రజావాణి, తదితర వేదికల ద్వారా జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. కాగా కలెక్టర్ పమేలా సత్పతి డీడీలు చెల్లించిన లబ్ధిదారులందరికీ తిరిగి డబ్బులు ఇవ్వడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. జిల్లాలో మొదటి విడతలో 15,422 యూనిట్లు గొర్రెల పంపిణీ చేశారు. ఇరవై ఆడ గొర్రెలు, ఒక పొట్టేలు ఉండే యూనిట్‌కు రూ. 1.25 లక్షల ధర నిర్ణయించారు. అందులో లబ్ధిదారుల వాటాగా రూ. 31,250 చెల్లించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత డీడీలు చెల్లించి యూనిట్లు పొందిన వారందరికీ హుజూరాబాద్ ఎన్నికల సమయంలోనే గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో గొర్రెల ధర పెరగడంతో యూనిట్ ధర రూ. 1.75 లక్షలుగా నిర్ణయించారు. అందులో లబ్ధిదారుల వాటాగా రూ. 43,750 చెల్లించాలి. ఈ విడతలో 3,404 యూనిట్ల కోసం డీడీలు చెల్లించగా 718 మందికి యూనిట్లు పంపిణీ చేశారు. మిగిలిన 2,686 మందికి తాజాగా డీడీల సొమ్ము తిరిగి చెల్లించనున్నారు. చెల్లించిన డీడీల డబ్బుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 1,009 మందికి సంబంధించి రెండు మూడు రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. మరో 500 మందికి సంబంధించి సైతం జిల్లా కలెక్టర్ అనుమతితో త్వరలోనే డబ్బులు జమ చేయనున్నారు. డీడీలు చెల్లించి ఇప్పటి వరకు తిరిగి డబ్బులు పొందేందుకు దరఖాస్తు చేసుకొని లబ్ధిదారులు వారి బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారుల్లో బ్యాంకు అకౌంట్ లేని వారికి సైతం తిరిగి డీడీ రూపంలోనే డబ్బులు చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీడీలు కట్టిన వారందరికీ తిరిగి పైకం చెల్లించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. డబ్బులు తిరిగి పొందాలనుకునే వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించాం.

# సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్య రక్షణ



మోత్కూరు:గోఆధారిత, సేంద్రీయ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ నిపుణుడు రంజాన రమేష్ అన్నారుమోత్కూరు ఆర్యవైశ్య భవనలో గోవర్ధనగిరి గోశాల, ఆదిగురు భారత ఫౌండేషన ఆధ్వర్యంలో ఓం సాయి చిల్డ్రన్స క్లినిక్ సహకారంతో రైతులకు సేంద్రీ య సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారుచేసే ఆహార ఉత్పత్తులు విషపూరితమై మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో డిమాండ్ లేదనుకుంటే రైతులు తమ వరకైనా సేంద్రీయ పంటలు పండించి, ఆరోగ్యాలు కాపాడుకోవాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తులను ప్రజలకు క్రమంగా పరిచయం చేస్తే వారే ఆ ఉత్పత్తులు కొనుగోలు చేస్తారన్నారు. విషతుల్యమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసి భవిష్యత తరాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు. గో ఆధారిత, సేంద్రీయ సాగు ఎలా చేయాలి, దానితో కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సేంద్రీయ వ్యవసాయ రైతు బిల్లపాటి గోవర్ధనరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర గో సేవ ప్రముఖ్ ఆకుతోట రామారావు, దేశీయ విత్తన పరిరక్షకులు శ్రీకాంత, ఏబీఎస్ ఫౌండేషన వ్యవస్థాపకుడు గోపీమాధవ్, స్కందానంద సరస్వతి మాత, గోఆధారిత ఉత్పత్తుల నిపుణుడు కాంబోజు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల భూములపై నివేదిక ఇవ్వండి

## మానవపాడు తహసీల్దారును ఆదేశించిన కలెక్టర్



అలంపూర్ : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడు చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయ భూములపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ బీఎం సంతోష్ మానవపాడు తహసీల్దారును ఆదేశించారు. ఎండోమెంట్ కమిషనర్ కూడా ఆరా తీసినట్లు తెలిసింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆ భూముల అనుభవదారు తన నలుగురు కుమారులపై పట్టా చేసి, అమ్మ కానికి సిద్ధం చేశారని వార్త ప్రచురితమైంది. దాంతో బుధవారమే సంబంధిత సర్వే నంబర్ 155పై పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టా మార్పిడి ఏ సంవత్సరంలో జరిగింది?, మార్పిడి వెనుక ఎవరి హస్తం ఉందన్న పూర్తి వివరాలు కోరినట్లు తెలిసింది. దీంతో మానవపాడు రెవెన్యూ కార్యాలయ అధికారులు సదరు ఆలయాల భూముల రికార్డులను పరిశీలించారు. గ్రామ పెద్దలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆలయాల భూములను కాపాడాలని, దేవాలయాల్లో సేవ చేసేందుకు ఎండోమెంట్ శాఖకు తమ పూర్వీకులు భూములు ఇచ్చారని గ్రామ పెద్దలు తెలిపారు. భూమిని అనుభవించే వారు టెంపుల్స్‌లో రోజూ మంగళవాయిద్యాలు వినిపించాలనే నిబంధన ఉన్నట్లు గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, పుల్లారెడ్డి, జానేశ్వరరెడ్డి, రాజారెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. భూములపై పూర్తి నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు మండల అధికారులు చెప్పారు. చెన్నిపాడు ఆలయాల భూముల బాగోతంపై దేవాదాయశాఖ ఆరా తీసినట్లు జిల్లా శాఖ అధికారులు తెలిపారు. భూములను పరిశీలించి నివేదిక కోరారని శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వరి తెలిపారు. అనుభవదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని చెప్పారన్నారు. రెవెన్యూ అధికారులకు తమ వద్ద ఉన్న ఆధారాలు ఇస్తామని, పట్టామార్పిడికి కారణాలను విశ్లేషించాల్సి ఉందని అన్నారు.

## ప్రయివేటు ఆస్పత్రిలను

# తనిఖీ చేసిన ఆరోగ్యశాఖ అధికారి



భువనగిరి:భువనగిరి కలెక్టరేట్ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ , జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో డిప్యూటీ డి.ఎం./ హెచ్.వో లు, ప్రోగ్రామాధికారుల బృందం భువనగిరిలోని జయలక్ష్మి హాస్పిటల్, నిర్మల హాస్పిటల్, కేకే ప్రైవేటు నర్సింగ్ హోమ్ ఆస్పత్రులలో అకస్మాత్తుగా తనిఖీ తనిఖీ చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. వై. పాపారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో నిబంధనకు విరుద్ధంగా చాలా ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ కాన్పులు తగ్గించి సిజేరియన్ కాన్పుల్ ఎక్కువగా చేస్తున్నారని, ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనకు వ్యతిరేకం అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే తల్లుల్లో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. తగిన కారణాలు లేకుండా సిజేరియన్ చేసినచో కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈరోజు బృందం తిరిగి మూడు ఆసుపత్రుల్లో రిపోర్టు పేషంట్ కే సీట్లు పరిశీలించడం జరిగిందనారు. వీటిలో కొన్ని కాన్పులకు సరైన కారణాలు పొందుపరచలేదని వీటి విషయంలో ముందుగా నోటీసులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలు ఇప్పటివరకు ప్రిన్స్ ఆసుపత్రి, గాయత్రీ హాస్పిటల్, మహేంద్ర ఆసుపత్రిలకు నోటీసులు ఇవ్వడం జరిగిందనీ, తిరిగి వారి వివరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు అర్హత లేని వారు సిజేరియన్ ఆపరేషన్లు చేసినట్టయితే అలాంటి హాస్పిటల్ రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలందరూ కూడా ముహూర్తాలు పాటించి మంచి రోజున అను నొప్పులు భరించలేని సిజరిన్లకి ముగ్గు చూపకూడదని కాన్పులొచ్చే వరకు ఆగి సాధారణ ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ఉమ్మనీరు పెంచుకోవడానికి రక్తం తగినంత ఉండేలా చూసుకోవడానికి వైద్యుల సూచనలు మేరకు ఆహార పదార్థాల ద్వారా పొందాలన్నారు. తదుపరి మూడు రోజులు జిల్లాలో సిజేరియన్ ఆపరేషన్ చేస్తున్న ఆసుపత్రిలో తనిఖీలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డా శిల్పిని, డా యశోద, ప్రోగ్రాం అధికారులు డా. సుమన్ కళ్యాణ్, డెమో మధుసూదన్ రెడ్డి, సిహెచ్ఓ నగేష్ , శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# జోరుగా ఒండ్రు అక్రమ రవాణా



మక్తల్, : మండలంలోని మంథన్‌గోడ్ పెద్ద చెరువు నుంచి ఒండ్రు మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. మట్టి తరలించేందుకు అనుమతులు తీసుకోవల్సి ఉన్నా.. అవేవీ పట్టించుకోకుండా ఇష్టారీతిగా ఒండ్రును తరలిస్తున్నారు. చెరువులో రెండు భారీ పొక్లెయినర్లు ఉంచి 50 ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. మండలంలోని గుడిగండ్ల, జక్లేర్, జౌళాపురం, రామసముద్రం, బొందల్‌కుంట గ్రామాల సమీపంలో జాతీయ రహదారి పొడవున పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలు వెలిశాయి. ఇటుకల తయారు చేసేందుకు భారీగా ఒండ్రు అవసరం కావడంతో పలుబడి ఉన్న నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా ఒండ్రును తరలించి సొమ్ము చేసుకుంటారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొంత మంది ఫిర్యాదు చేసినా కనీసం పరిశీలనకు సైతం రావడం లేదని పలువురు అంటున్నారు. రైతుల పంట పొలాలకు ఒండ్రును తరలించాల్సింది పోయి అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఒండ్రు మట్టికి అడ్డుకట్ట వేయాలని చుట్టుపక్కల గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సువర్ణరాజును వివరణ కోరగా.. తాను మహబూబ్‌నగర్‌లోని ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూం వద్ద ఉన్నట్లు తెలిపారు. మంథన్‌గోడ్ చెరువు నుంచి ఒండ్రు తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# బాలికల విద్యకు భరోసా.. కస్తూర్బా



వలిగొండ: ప్రస్తుత కాలంలో కార్పొరేటు స్థాయి పాఠశాల, కళాశాల విద్యనభ్యసించాలంటే దూర ప్రాంతాలకు వెళ్లి రూ.లక్షలు పెట్టాల్సిందే. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు తమ పిల్లల చదువు కోసం అన్ని రూపాయలు ఖర్చు పెట్టాలంటే సాధ్యం కానీ విషయమే. అలాంటి పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్య, వసతులు అందించడమే లక్ష్యంగా వలిగొండ మండలం లోతుకుంట గ్రామ పరిధిలో కస్తూర్బా విద్యాలయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇక్కడ పిల్లలకు చదువుతోపాటు నైపుణ్యాలు మెరుగుపర్చి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 11 కస్తూర్బా పాఠశాలలు, 7 కస్తూర్బా జూనియర్ కళాశాలల్లో (2024-2025) విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినుల ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థినులకు ప్రవేశానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకోవడానికి కస్తూర్బా పాఠశాలల ఎస్‌వోల చరవాణి నంబరుకు విద్యార్థినుల ఆధార్ కార్డు, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం వాట్సాప్ ద్వారా, చరవాణిలో మాట్లాడి సమాచారం ఇస్తే పాఠశాల, కళాశాలలో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఇక్కడ విద్యార్థినులకు నాణ్యమైన, విద్య, భోజనం అందించడంతో పాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తూ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తారు. వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి, అడ్డగూడూరు, గుండాల, మోత్కూర్, ఆత్మకూర్ (ఎం), బొమ్మలరామారం, తుర్కపల్లి, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం. కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం. పేద, మధ్య తరగతి బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు (2024-2025) విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఇక్కడ పదో తరగతి పూర్తి చేసిన బాలికలకు మరో రెండేళ్లు చదువుకునే అవకాశం ఉంటుంది. ప్రవేశాల కోసం చరవాణిలో సమాచారం తెలియజేస్తే సరిపోతుంది

# చుక్కల్లో మిర్చి, అల్లం, వెల్లుల్లి ధరలు



నారాయణఖేడ్: మామిడి కాత చేతికి అందడానికి తోడు వేసవి సెలవులు కావడంతో జనాలు పచ్చళ్లు చేసుకోవడంపై దృష్టి సారిస్తారు. మిర్చి, అల్లం, వెల్లుల్లి వంట నూనె ధరలు చుక్కలనంటుతుండంతో పచ్చడి చేసుకోవడానికి సాధారణ జనాలు జంకుతున్నారు. మామిడికాయ పచ్చడి చేసుకోవడానికి ప్రధానంగా అల్లం, వెల్లుల్లి, మిర్చి పొడి అవసరం. గత సంవత్సరం అల్లం, వెల్లుల్లి ధరలు కిలో రూ. 100 నుంచి 120 వరకు ఉండగా, ప్రస్తుతం వెల్లుల్లి కిలో రూ. 240, అల్లం నాణ్యమైనది రూ. 140 చొప్పున విక్రయిస్తున్నారు. పచ్చళ్లకు వినియోగించే కారం పొడి కిలో రూ. 600 వరకు ఉంది. నువ్వులు, ఆవాల ధరలు కూడా గతంలో కంటే పెరిగాయి. ఈ సంవత్సరం మామిడికాత ఆశాజనకంగా కాసినప్పటికీ, ఎండల తీవ్రత వల్ల మామిడి కాయలు దెబ్బతినడంతో నాణ్యమైన కాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మార్కెట్లో మామిడి పచ్చడి కాయలు సైజును బట్టి రూ. 8 నుంచి 10 వరకు విక్రయిస్తున్నారు. వాటిని ముక్కలుగా చేసుకోవడానికి ఒక్కో కాయకు రూ. 4 చొప్పున తీసుకుంటున్నారు. గుజ్జు కాయలు కిలో రూ. 80 చొప్పున విక్రయిస్తున్నారు. ఎండాకాలంలో మామిడి కాయలతో పచ్చళ్లు చేసుకొని ఏడాది పాటు తినడానికి జనాలు ఆసక్తి చూపుతారు. ఈ సంవత్సరం పచ్చళ్లు తయారు చేసుకోవడానికి అవసరమైన అన్ని సరుకుల ధరలు చుక్కలనంటడంతో వాటి తయారీకి భయపడుతున్నారు.

## జాతీయ రహదారి భూసేకరణ,

# విస్తరణ పనులు వేగవంతం చేయాలి

### - కలెక్టర్ ఉదయ్‌కుమార్



నాగర్‌కర్నూల్, : జాతీయ రహదారి పనులు, భూసేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు నాగర్‌కర్నూల్ కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సంబంధిత శాఖలైన రెవె న్యూ, జాతీయ రహదారి అధికారులతో భూసేకరణ ప నులు, జాతీయ రహదారి పురోగతి పనులపై సమీక్ష ని ర్వహించారు. జాతీయ రహదారికి సంబంధించి జిల్లా లోని కొల్లాపూర్ మండల పరిధిలోని వరిదేల గ్రామ పరి ధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అం దుకు సంబంధించిన భూయాజమానులు, రైతులకు కా వాల్సిన నష్ట పరిహారాన్ని త్వరితగతిన చెల్లించేలా చ ర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులు, నేషనల్ హైవే 167కే కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 79కిలో మీటర్ల వరకు కొనసాగుతున్న విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. లాండ్ ఆక్విజేషన్ పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి కావాలని, అవార్డు పరిహారం చె ల్లింపుల పురోగతిపై త్వరలో సమీక్షించనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రి య ప్రశాంతంగా ముగియడంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లనే జిల్లాలో ఎన్నికలు విజయ వంతమయ్యాయని తెలిపారు.

# నిరుపయోగంగా పశువుల హాస్టల్



నారాయణరావుపేట : మనుషులకే కాదు.. మూగజీవాలకు సైతం హాస్టళ్ల ఏర్పాటు చేస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందనే లక్ష్యం నీరుగారిపోతుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్‌లో రెండేళ్ల క్రితం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఈజీఎస్), కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎసఆర్) నిధులతో నిర్మించిన పశువుల హాస్టల్ నిరుపయోగంగా మారింది. సిద్దిపేట నియోజకవర్గా న్ని ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో నారాయణరావుపేట మండలంలోని ఇబ్రహీంపూర్, జక్కాపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో రూ. 2 కోట్లతో ఒక్కో హాస్టల్లో 160 గేదెలు, ఆవులు ఉండే సామర్థ్యంతో పశువుల హాస్టల్స్ నిర్మించారు. ఇబ్రహీంపూర్ గ్రామంలో పశువుల హాస్టల్‌కు మొ దట్లో స్థలం సేకరణ సమస్య ఏర్పడినప్పటికీ దాతల సహకారంతో స్థలం సమకూర్చుకుని రూ. 2 కోట్లతో సకల సౌకర్యాలతో నిర్మాణం చేపట్టి రెండేళ్ల క్రితం పశువుల హాస్టల్‌ను ప్రారంభించారు.

కానీ నాటి నుంచి నేటివరకు వినియోగంలో రాకపోవడం, వాహనాల పార్కింగ్, మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. చిన్న, సన్నకా రు రైతులకు, ఎస్సీ కార్పొరేషన్, మహిళా సంఘాల ద్వారా లబ్ధిదారులకు రెండేసి గేదెలు ఇప్పించాలనే లక్ష్యం ఆదిలోనే నీరుగారిపోయింది. పశువుల హాస్టల్ ప్రారంభించిన నాటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే వృథాగా మారిందనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇబ్రహీంపూర్‌లో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈజీఎస్ నుంచి రూ. 1 కోటి, సీఎసఆర్ నుంచి రూ. 1 కోటి నిధులతో సకల సౌకర్యాలతో పశువుల హాస్టల్ నిర్మించారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215